క్లుప్తంగా

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



శ్మశానవాటికలో సర్వే చేస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న శ్మశానవాటిక సమస్య తీరనుంది. స్థానిక దిబ్బలపాలెం ప్రాంతంలోని పలు వార్డుల ప్రజలు వినియోగించే శ్మశానవాటిక ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో దహన సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా స్థానిక సాయిబాబామెట్ట సమీపంలో శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు సోమవారం రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సరిహద్దులను సర్వే చేశారు. త్వరలోనే శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ యండగండి నాగబాబు, వీఆర్వో అవసరాల కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సోమవారం ప్రారంభించారు. తొలిరోజు వాహనదారులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రస్తుత వేసవిలో ప్రయాణికులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్సై స్వామినాయుడు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని చేపట్టిన పోలీసులను ఎంపీపీ అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, రుత్తల జోగిరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ, బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు ప్రారంభించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు



కేఓ మల్లవరంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులకు ఓ వరమని తుని మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు అన్నారు. మండలంలోని కేఓ మల్లవరంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, డొంక వెంకట బెనర్జీతో కలసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ లలిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 80 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. వీరిలో ఐదుగురిని శస్త్ర చికిత్సలకు, 40 మందిని కళ్ల జోళ్లకు ఎంపిక చేసినట్టు డాక్టర్ లలిత తెలిపారు. సచివాలయ కార్యదర్శులు పైల శివ, జె.వీరబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం



చిల్లంగిలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్‌లో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరిరాట వేశారు. మహిళలు పసుపు కొట్టారు. ఈ నెల 31వ స్వామి, అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెండ్లి కుమార్తెను చేస్తారని, మే 1వ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

లలితా సహస్రనామ పారాయణ

చిల్లంగి అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు.



ఏలేశ్వరంలో నిర్మానుష్యంగా మారిన నర్సీపట్నం రోడ్డు



గోకవరంలో వెలవెలబోతున్న వారపుసంత



ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణకు మాస్కులు ధరించిన మహిళలు

భగభగమండే

- నిప్పులు చెరుగుతున్న భానుడు
- 43 డిగ్రీలు దాటుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న ప్రజలు

గోకవరం/ప్రత్తిపాడు రూరల్/ఏలేశ్వరం: వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 43 డిగ్రీలకు పైబడి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవి తాపానికి ఉక్కబోత తోడవడంతో బయట సంచరించే వారితో పాటు ఇళ్లలోని వారు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో సోమవారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. మరో రెండు, మూడు రోజుల పాటు పగటి పూట ఉష్ణోగ్రతలు ఇదేవిధంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వెలవెలబోతున్న వారపు సంతలు

ఎండ తీవ్రతకు గ్రామాల్లో జరిగే వారపు సంతలు సైతం వెలవెలబోతున్నాయి. సుమారు వంద సంవత్సరాల చరిత్ర ఉన్న గోకవరం వారపు సంతకు మండలం నుంచే కాకుండా ఏజెన్సీలోని ఏడు మండలాలు, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు చింతపండు, చీపుర్లు, వివిధ రకాల సరకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. వీరి రాకతో వారపు సంత జరిగే ప్రదేశంతో పాటు ప్రధాన రహదారులు రద్దీగా ఉంటాయి. కాగా సోమవారం ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో సంత ప్రదేశంతో పాటు రహదారులు వెలవెలబోయాయి. ఉదయం 11 గంటల నుంచే జనం పలచబడిపోవడంతో వ్యాపారస్తులు దిగాలు చెందారు. ఉష్ణతాపం నుంచి తప్పించుకోలేక వ్యాపారస్తులు సైతం దుకాణాలు మూసివేసి ఇంటిబాట పట్టారు. సంతలో వ్యాపారాలు నిర్వహించే వారు మాత్రం పరదాలు కట్టుకుని పలు ఇబ్బందులు పడ్డారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో గ్రామాల్లో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

ఎండకు భయపడి ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ వేడిని తట్టుకోలేక 16 నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్ల కింద వాహనాలను నిలిపివేశారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగించారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు జనం శీతలపానీయాలను ఆశ్రయించారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, కూల్‌డ్రింక్‌ల విక్రయాలు జోరందుకున్నాయి.



ధర్మవరం వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో మినహా ఇంట్లోనే ఉండాలి. బయటకు రావాల్సిన పరిస్థితిలో పలుచటి కాటన్ దుస్తులతో పాటు గొడుగు, టోపి వంటివి ధరించాలి. తరచూ ద్రవపదార్థాలతో పాటు పుచ్చకాయ, బొప్పాయి వంటి పండ్లు తీసుకోవాలి. ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి తక్షణమే వైద్య సేవలందించాలి.

– డాక్టర్ వనజాకుమారి, సూపరింటెండెంట్, గోకవరం ప్రభుత్వాస్పత్రి

సర్వేపల్లి రాధాకృష్ణకు ఘన నివాళులు



కోటనందూరులో రాధాకృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలోని సర్వేపల్లి విగ్రహానికి హెచ్ఎం సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి కనకదుర్గశ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ ప్రధానిగా సర్వేపల్లి రాధాకృష్ణ చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

తుని: స్థానిక గణపతినగర్ పార్కు దగ్గర మంగళవారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకూ బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్టు తుని వాకర్స్ హెల్త్‌క్లబ్ ప్రతినిధి చదరం శివాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని వాకర్స్, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఇర్రిపాకలో గడపగడపకూ...

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు



ఒంటిమామిడిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఒంటిమామిడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

తొండంగి: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని ఒంటిమామిడిలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకం అందని కుటుంబం లేదన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల వారికీ ప్రభుత్వ ఫలాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ అంగులూరి అరుణ్ కుమార్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, సర్పంచ్ అంగులూరి సుధాకర్, ఉప సర్పంచ్ గోసల కిషోర్, పెదపూడి రమణ, కింతాడ పాపారావు, కొయ్యా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు మంత్రి రాజా పరామర్శ

కోటనందూరు: పితృవియోగంతో బాధపడుతున్న వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్‌ను సోమవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. స్వగ్రామం కాకరాపల్లిలో లంక ప్రసాద్‌ను పరామర్శించి అతని తండ్రి లంక రాజారావు మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

కేపే మల్లవరంలో..

మండలంలోని కేపే మల్లవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గాడి రమణబాబు తండ్రి గాడి రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. సోమవారం మంత్రి దాడిశెట్టి రాజా రమణబాబును పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, పార్టీ నాయకులు గర్సింగు దొరబాబు, కురసా మల్లయ్య, కొరుప్రోలు ఆదినారాయణమూర్తి, కోఆప్షన్ మెంబర్ జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కాకరాపల్లిలో లంక ప్రసాద్‌ను పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

నవధాన్యాల సాగుపై అవగాహన



పెద్దిపాలెంలో ప్రదర్శించిన 31 రకాల నవధాన్యాలు

ప్రత్తిపాడు రూరల్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ ఎంటీ రామలక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 31 రకాల నవధాన్యలను ప్రదర్శించారు. అనంతరం రామలక్ష్మి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయన్నారు. భూమిలో తేమ శాతం, కర్బన శాతం పెరిగి ఫలితంగా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ఐబీ ఎన్‌డీఏ ఎం మల్లేశ్వరి, ఏపీసీఎన్ఎఫ్ ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టెలను వినియోగంలోకి తేవాలని వినతి



ఏలేశ్వరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: వేసవి తాపాన్ని తట్టుకునేందుకు గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలను వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టెం వెంకటరమణ ఆధ్వర్యంలో తహసీల్దార్ సూరపరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి ఎండలను తట్టుకొనేందుకు పశువులకు నీటితొట్టెలు, ప్రయాణికులకు బస్‌షెల్టర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండ్‌ల వద్ద సామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్‌లను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి లోవరాజు, థామస్, రాతిత్రింది కృష్ణారావు, కొప్పుల రాంబాబు, లింగం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గండేపల్లిలో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి అత్యవసర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా ఐక్యతతో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల్లో ప్రజల సమస్యలు, అవసరాలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సింగరంపాలెం, పి.నాయకంపల్లి, జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట, మల్లేపల్లి, తాళ్లూరు, మురారి, గండేపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, తాగునీరు తదితర సమస్యలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కుంచే రాజా, బిత్రా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, గండేపల్లి ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు, మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, నీలాద్రిరావుపేట, ఉప్పలపాడు సర్పంచులు ములంపాక సురేష్, అడబాల ఆంజనేయులు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ రామన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్

తుని రూరల్: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం తేటగుంట, టి.వెంకటాపురం, వల్లూరు, చామవరం, కేఓ.మల్లవరం, వి.కొత్తూరు, హంసవరం, లోవ కొత్తూరు, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, రాపాక, దొండవాక, మర్లపాడు, రాజుపేట గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, సర్పంచులు అత్తి నాగరాజు, రాయి మేరీ అవినాష్, బుద్దాల సత్తిబాబు, నాయకులు గణేషుల వీరబాబు, లంక కృపానందం, వడ్డాది యేసుబాబు, కిల్లాడ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ముప్పిడి ఏసుబాబు, ఉప సర్పంచ్ చక్రం, నాగులాపల్లి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. గోకవరం సచివాలయం–4 పరిధిలోనూ, వెదురుపాకలో సోమవారం సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, బిజ్జి రాజు, బివి చంద్రం, మచ్చా మోహన్ తదితరులు పాల్గొన్నారు.



తేటగుంటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పోతులూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



గోకవరంలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగ్గంపేటలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: ప్రతి కుటుంబానికి మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు అన్నారు. జగ్గంపేట నెహ్రూ కాలనీలో సోమవారం ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు.

రామన్నపాలెంలో బోట్ల ఎన్యుమరేషన్

కొత్తపల్లి: రామన్నపాలెంలోని ఉప్పుటేరు వద్ద సోమవారం మత్స్యకార బోట్లకు అధికారులు ఎన్యుమరేషన్ నిర్వహించారు. మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో బోట్లు ఉన్నవారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే మత్స్యకార భరోసా పొందాలంటే ఎన్యుమరేషన్ తప్పని సరి అన్నారు. మండలంలోని 1222 బోట్లకు సంబంధించి 7,330 మంది మత్స్యకారుల వివరాలను నమోదు చేయనున్నట్లు ఆయన తెలపారు.

స్తంభించిన ట్రాఫిక్

బోట్ల ఎన్యుమరేషన్ చేయించుకునేందుకు వందలాది మంది మత్స్యకారులు రావడంతో ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. మత్స్యకారులు తమ వాహనాలను బీచ్‌రోడ్డులో నిలపడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

తుని: అగ్ని ప్రమాదాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తుని అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణరాజు వివరించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను వివరించారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, పాఠశాలలు, కర్మాగారాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయి, నివారణ చర్యలు, అగ్నిమాపక వాహనం పనితీరును వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఫోర్‌మెన్ సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



తునిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిషేధ సమయంలో వేటకు వెళ్లరాదు

కొత్తపల్లి: వేట నిషేధ సమయంలో మత్స్యకారులెవ్వరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని వాకలపూడి మెరైన్ సీఐ సుమంత్ సూచించారు. అమీనాబాదు తీరప్రాంతంలో సోమవారం మత్స్యకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ 61 రోజులు సముద్రంలో మత్స్యసంపద వృద్ధి చెందే సమయమన్నారు. ఈ సమయంలో వేట చేయడం వలన మత్స్య సంపదకు పూర్తిగా నష్టం కలుగుతుందన్నారు. వేట నిషేధం అమలుకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడీ శ్రావణి, మెరైన్ సీఐలు సత్యనారాయణరెడ్డి, అవినాష్ పాల్గొన్నారు.